క్లుప్తంగా

నేడు జమ్ము వలసలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

రామభద్రపురం: మండలంలోని జుమ్మువలస, జీలుగువలస గిరిజన గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం నిర్వహించనున్నట్లు ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు ఓ ప్రకటనలో మంగళవారం తెలిపారు. ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు పాల్గొనే ఈ కార్యక్రమానికి మండల స్థాయి నేతలు, కార్యకర్తలు, అధికారులంతా హాజరు కావాలని కోరారు.

పారదర్శకంగా భూముల రీసర్వే



సూచనలిస్తున్న తహసీల్దార్ రఫీజాన్

బాడంగి: పారదర్శకంగా భూముల రీసర్వే చేపట్టాలని తహసీల్దార్ రఫీజాన్ సూచించారు. మంగళవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వీఆర్‌వోలతో సమావేశమైన ఆయన డీ–పట్టా భూముల్లో సకాలంలో సర్వే పూర్తి చేయాలని తెలిపారు. భూహక్కుదారులకు ఆ భూమి ఏ విధంగా సంక్రమించిందన్న విషయం కూడా రికార్డుల ఆధారంగా పరిశీలించాలన్నారు. ఓటర్ల సర్వే కూడా పక్కాగా నిర్వహించాలని, ఖచ్చితమైన ఓటర్ల జాబితా రూపొందించి, నివేదించాలన్నారు. సమావేశంలో హెచ్‌డీటీ చిన్నంనాయుడు, ఎంఆర్‌ఐ సోమన్న, సర్వేయర్ సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

136 మందికి కొత్తగా పింఛన్లు



బాడంగిలో లబ్ధిదారుకు పింఛన్ నగదు అందజేస్తున్న జెడ్పీటీసీ రామారావు తదితరులు

బాడంగి: మండలంలో కొత్తగా మరో 136 మందికి పింఛన్లు మంజూరు కాగా వాటిని గ్రామ సచివాలయాల్లో ప్రజాప్రతినిధుల చేతులమీదుగా మంగళవారం అందజేశారు. స్థానిక సచివాలయంలో 14 మంది లబ్ధిదారులకు రెండో విడత కింద మంజూరైన పింఛన్లను జెడ్పీటీసీ పెద్దింటి రామారావు, ఎంపీటీసీ దేవరాపల్లి శ్రీను భవాని, సర్పంచ్ కండి రమేష్, కార్యదర్శి సూర్యారావు చేతులమీదుగా పంపిణీ చేశారు.

మట్టి వినాయక విగ్రహాల పంపిణీ



మట్టి విగ్రహాలు పంపిణీ చేస్తున్న వనమిత్ర సంస్థ అధ్యక్షుడు కృష్ణదాసు

బొబ్బిలి: మండలంలోని అలజంగి గ్రామంలో మట్టి వినాయక విగ్రహాలు మంగళవారం పంపిణీ చేశారు. వనమిత్ర సంస్థ అధ్యక్షుడు కె.కృష్ణదాసు మాట్లాడుతూ పర్యావరణ హితం కోరుతూ ఈ మట్టి విగ్రహాలను అందజేస్తున్నామని, పర్యావరణ కాలుష్యానికి కారణమయ్యే ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను వాడవద్దని కోరారు.

నేడు మండల స్థాయి స్కూల్ గేమ్స్

రాజాం సిటీ: మండలంలోని పొగిరి జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో మండల స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలు బుధవారం నిర్వహిస్తున్నట్లు ఎంఈవో ప్రవీణ్‌కుమార్ ఓ ప్రకటనలో మంగళవారం తెలిపారు. అండర్–14, అండర్–17 బాలబాలికలకు సంబంధించి, వాలీబాల్, కబడ్డీ పోటీలు ఉంటాయన్నారు. మండలంలోని అన్ని పాఠశాలల నుంచి పోటీల్లో పాల్గొనేందుకు విద్యార్థులను తీసుకురావాలని పీడీలను కోరారు.

శతశాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలి



విద్యార్థులు పరీక్షలు రాస్తుండడాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈవో బ్రాహ్మజీరావు

సంతకవిటి: ఈ ఏడాది పదో తరగతిలో శతశాతం ఉత్తీర్ణతకు ఉపాధ్యాయులంతా కృషి చేయాలని బొబ్బిలి డిప్యూటీ డీఈవో బ్రాహ్మజీరావు అన్నారు. మంగళవారం మండలంలోని బొద్దూరు జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించిన ఆయన విద్యార్థులకు నిర్వహించిన పరీక్షలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చదువులో వెనకబడిన విద్యార్థుల విద్యాప్రగతిపై ప్రత్యేక దృష్టిసారించాలని తెలిపారు. ప్రతీ విద్యార్థి విద్యాసామర్థ్యాల మెరుగుకు సాయంత్రం పూట స్టడీ అవర్స్ నిర్వహించాలన్నారు. ఆయన వెంట హెచ్‌ఎం మల్లేశ్వరరావు, ఉపాధ్యాయులు ఉన్నారు.

నాడు దోపిడీ పాలన.. నేడు సంక్షేమ పాలన..

- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



రామభద్రపురం: ఇంటింటికీ వెళ్లి, సంక్షేమ పాలనను వివరిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

రామభద్రపురం: టీడీపీ హయాంలో నాడు దోపిడీ పాలన కొనసాగిందని, వైఎస్సార్ సీపీ హయాంలో నేడు రాష్ట్రంలో సంక్షేమ పాలన కొనసాగుతోందని ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు అన్నారు. మండలంలోని కొండకెంగువ గ్రామంలో మంగళవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు చిన్నచిన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజా సంక్షేమమే పరమావధిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన కొనసాగిస్తున్నారన్నారు. రాష్ట్రంలో నలభై ఏళ్లలో జరగాల్సిన అభివృద్ధిని, నాలుగున్నరేళ్లలో చేసి, చూపించారన్నారు. సచివాలయ వ్యవస్థతో ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా లబ్ధిదారుల వద్దకే సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. అన్ని వర్గాల్లోని ప్రతీ కుటుంబానికి ఏదో ఒక సంక్షేమ పథకం వర్తించిందన్నారు. పథకాలతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యాయన్నారు. మరోవైపు పోర్టులు, విమానాశ్రయాలకు శంకుస్థాపన చేస్తూనే గ్రామాల్లోని ప్రతీ గ్రామ సచివాలయ పరిధిలో అభివృద్ధి పనుల కోసం రూ.20 లక్షలు మంజూరు చేశారన్నారు. గతంలో టీడీపీ హయాంలో ఏ ఒక్క పథకం కావాలన్నా ఆ పార్టీ నాయకులు, జన్మభూమి కమిటీల సభ్యులు సూచించిన వారికే వచ్చేవన్నారు. ఇప్పుడు అలా కాదన్నారు. అర్హులందరికీ పారదర్శకంగా పథకాలు అందుతున్నాయన్నారు. వీటితో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. నియోజకవర్గంలో కూడా గత 15 ఏళ్లలో జరగని అభివృద్ధిని తాము చేసి చూపిస్తున్నామన్నారు. 2024 ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా పనిచేయాలని, ప్రజలు కూడా ఆశీర్వదించి, సీఎం జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతి, బొబ్బిలి మండలం పార్టీ అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు, వైస్ ఎంపీపీ బెల్లాన ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్



ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్

వంగర: ప్రజాసంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. మంగళవారం మండలంలోని సంగాం గ్రామంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన వారు నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం వివరించారు. అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా, ఏవైనా సమస్యలున్నా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు వారి దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తోందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంకల్పయాత్రలో ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నారన్నారు. ఇప్పటివరకు ఎన్నికల మేనిఫెస్టోలోని దాదాపు 99 శాతం హామీలు నెరవేర్చారన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం కమిటీల పేరుతో అర్హులకు మొండిచేయి చూపిందని, పచ్చచొక్కాల వారికే ప్రభుత్వ పథకాలు అందించిందని గుర్తుచేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మాత్రం పలు ప్రాంతాల అభివృద్ధితో పాటు ప్రజాసంక్షేమానికి కూడా పెద్దపీట వేస్తోందన్నారు. ప్రభుత్వ పథకాలతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యాయన్నారు. సచివాలయ వ్యవస్థతో ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకే ప్రభుత్వ పథకాలను తీసుకువచ్చిన ఘనత సీఎం జగన్‌దేనన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, మళ్లీ సీఎం జగనన్ననే ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ, మండల పార్టీ కన్వీనర్ కరణం సుదర్శనరావు, వైస్ ఎంపీపీ కిమిడి ఉమామహేశ్వరరావు, సర్పంచ్ గేదెల వెంకటనాయుడు, ఎంపీటీసీ గేదెల పారమ్మ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా సీఎంఆర్‌ఎఫ్

- ఎమ్మెల్యే కంబాల జోగులు



సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

రేగిడి: పేదలకు అండగా సీఎంఆర్‌ఎఫ్(ముఖ్యమంత్రి సహాయ నిధి) నిలుస్తోందని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మండలంలోని పెద్దలింగాలవలస గ్రామానికి చెందిన రెడ్డి తేజేశ్వరికి సంబంధించి, సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.3.50 లక్షల చెక్కును ఎమ్మెల్యే చేతుల మీదుగా మంగళవారం అందజేశారు. డఫ్ అండ్ డంబ్ సమస్యతో బాధపడుతున్న ఈమె ఆరోగ్యం రోజురోజుకూ క్షీణిస్తుండడంతో ఇటీవల ఆపరేషన్ చేయించుకున్నారు. ఈ ఆపరేషన్ నిమిత్తం ఖర్చు చేసిన నగదును అప్పు రూపంలో వాడి, దానిని తీర్చేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ మేరకు బాధితురాలు సీఎంఆర్‌ఎఫ్ సాయం కోసం దరఖాస్తు చేసుకోగా, వెంటనే నగదు మంజూరు చేశారని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వావిలపల్లి జగన్మోహనరావు, ఎంపీటీసీ రెడ్డి నర్సింగరావు, మండల విప్ మజ్జి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ రాజాం రూరల్ కన్వీనర్ లావేటి రాజగోపాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించేందుకే పోటీలు

- బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు



తెర్లాం: క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసరావు

తెర్లాం: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించేందుకే రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం రా అనే కార్యక్రమం పేరిట స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయిలో క్రీడాపోటీలు నిర్వహిస్తోందని బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని పెరుమాళి జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో మండల స్థాయి ఆటల పోటీలను మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎంతోమంది క్రీడాకారులు తమలో ప్రతిభ ఉన్నా ఆర్థిక స్థోమత లేని కారణంగా బయట ప్రాంతాల్లో జరిగే క్రీడాపోటీలకు వెళ్లలేకపోతున్నారన్నారు. ప్రతిభ ఉన్న ప్రతీ క్రీడాకారుడిని ప్రోత్సహించాలన్నారు. ప్రతీ విద్యార్థి, క్రీడాకారుడు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ప్రతినిధి అప్పలరాజు, ఎంఈవో త్రినాధరావు తదితరులు పాల్గొన్నారు.

180 మంది హాజరు..

బాడంగి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి ఆటల పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్–14, అండర్–17 విభాగాల్లో బాలబాలికలకు సంబంధించి, పోటీలు నిర్వహిస్తున్నట్లు మండల విద్యాశాఖాధికారి–2 ఎం.రాజేశ్వరి, హెచ్‌ఎం డి.సత్యనారాయణ తెలిపారు. ఈ పోటీలకు బాడంగి గురుకులం, కేజీబీవీ, పాల్తేరు, బాడంగి, కోడూరు, రేజేరు, వాడాడ, గొల్లాది పాఠశాలల నుంచి మొత్తం 180 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించడం జరుగుతోందన్నారు.



తెర్లాం: వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు



బాడంగి: పోటీలు ప్రారంభించి, క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంఈవో–2 రాజేశ్వరి, హెచ్‌ఎం సత్యనారాయణ

రోడ్ల నిర్మాణానికి భూమిపూజ



బొబ్బిలి: సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న పార్టీ మండల అధ్యక్షుడు వేణుగోపాలనాయుడు

బొబ్బిలి: మండలంలోని పిరిడి గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు మంగళవారం భూమిపూజ చేశారు. వైఎస్సార్ సీపీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని, ప్రతీ గ్రామ సచివాలయం పరిధిలో అభివృద్ధి పనులకు రూ.20 లక్షల చొప్పున నిధులు మంజూరు చేసి, ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకుంటోందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ తుట్ట వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రూ.1.9 లక్షలతో సీసీ రోడ్డు..

రాజాం: మండలంలోని ఆగూరు గ్రామంలో దాదాపు రూ.1.90 లక్షల వ్యయంతో ప్రధాన వీధి సీసీ రోడ్డు నిర్మాణ పనులు చాలా చురుగ్గా జరుగుతున్నాయి. ఈ పనులను పీఆర్ జేఈ ప్రభాకరరావు, సర్పంచ్ అప్పారావు కలిసి మంగళవారం పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాల మేర పనులు చేపట్టాలని జేఈ సూచించారు. ఇదే గ్రామంలో రెండు చోట్ల పంచాయతీ నిధులతో రోడ్ల నిర్మాణం చేసినట్లు జేఈ వెల్లడించారు. మొత్తం రూ.3.70 లక్షల నిధులను సీసీ రోడ్ల నిమిత్తం కేటాయించినట్లు పేర్కొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ శ్రీనివాసరావు

రేగిడి: వాహనదారులంతా ట్రాఫిక్ నిబంధనలు పాటించి, రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని ఎస్‌ఐ ఇ.శ్రీనివాసరావు కోరారు. మండలంలోని మజ్జిరాముడుపేట కూడలిలో వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అటువైపుగా వచ్చే వాహనదారులను ఆపి, ద్విచక్ర వాహనదారులైతే తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, పరిమితికి మించి ప్రయాణికులతో వాహనాలు నడపకూడదన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'ను జయప్రదం చేయండి

- ఎంపీడీవో శంబంగి రామకృష్ణ



జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమ నిర్వహణపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో రామకృష్ణ



రాజాం సిటీ: వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న మున్సిపల్ కమిషనర్ కృష్ణారావు

తెర్లాం: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని జయప్రదం చేయండి అని ఎంపీడీవో శంబంగి రామకృష్ణ కోరారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో వైద్య సిబ్బందికి కార్యక్రమ నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. ఎంపీడీవో మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీ నుంచి వలంటీర్లు తమ పరిధిలోని 50 ఇళ్లకు వెళ్లి, కార్యక్రమంపై అవగాహన కల్పిస్తారని, ఆ తర్వాత ఆ వివరాల ఆధారంగా సీహెచ్‌వోలు, ఏఎన్‌ఎంలు ఇంటింటికీ వెళ్లి, ఎవరైనా ఆరోగ్య సమస్యలతో బాధపడితే వివరాలు సేకరిస్తారన్నారు. ఈ నెల 30వ తేదీ నుంచి మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి, సర్వేలో గుర్తించిన రోగులకు తగిన వైద్యసేవలు, మందులు అందజేయడం జరుగుతుందన్నారు. విద్య, ఐసీడీఎస్ శాఖలు కూడా పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు ఆరోగ్య తనిఖీలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ బాడంగి ప్రాజెక్ట్ పీవో కె.రాజ్యలక్ష్మి, ఎంఈవో త్రినాధరావు, పెరుమాళి పీహెచ్‌సీ డాక్టర్ మాధవి తదితరులు పాల్గొన్నారు.

రాజాం సిటీ: పట్టణ పరిధిలో త్వరలో జరగనున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి సంబంధించి, వైద్య సిబ్బంది సమగ్ర సమాచారం సేకరించాలని కమిషనర్ డీటీవీ కృష్ణారావు సూచించారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో అర్బన్ పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది, సచివాలయ సిబ్బందితో సమావేశమైన ఆయన వచ్చే నెల 5, 12వ తేదీల్లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపట్టనున్నామని, దీనికి సంబంధించి ఈ నెల 15వ తేదీ నుంచే వలంటీర్లతో ఇంటింట సర్వే చేయించి, రోగుల వివరాలు నమోదు చేయించాలన్నారు. కార్యక్రమ నిర్వహణపై అశ్రద్ధ వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో అర్బన్ పీహెచ్‌సీ వైద్యాధికారి అనూష, సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రబాబును సమర్థించడంపై విమర్శలు

బొబ్బిలి: అవినీతిపరుడైన టీడీపీ అధినేత చంద్రబాబును బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు పరంజ్యోతి వెనకేసుకురావడాన్ని(చంద్రబాబుకు మద్దతు పలకడం) ఆ పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ సోరు సాంబయ్య ఖండించారు. చంద్రబాబుకు మరో దత్తపుత్రుడు దొరికాడని, అతడు మా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడేనని, ఆయన కూడా చంద్రబాబుకు అమ్ముడుపోయినట్లు కనిపిస్తోందని సంచలన వ్యాఖ్యలు చేశారు. మంగళవారం ఇదే విషయమై స్థానిక విలేకరులతో మాట్లాడిన ఆయన బీఎస్పీ ఆవిర్భావం నుంచి అవినీతిపరులైన రాజకీయ నాయకులను మా పార్టీ నేతలు సమర్థించిన దాఖలాలు లేవన్నారు. అయితే చంద్రబాబు జైలుపాలు కావడాన్ని నిరసిస్తూ తమ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆందోళనకు పిలుపునివ్వడం విస్మయానికి గురిచేసిందన్నారు. అయితే ఆయన మాటలను జిల్లా నేతలు పెద్దగా పట్టించుకోలేదన్నారు. ఆయన అలా వ్యవహరించడం మా పార్టీ సిద్ధాంతానికి విరుద్ధమన్నారు.

విద్యుత్‌షాక్‌తో తాపీమేస్త్రీ మృతి



నారాయణరావు(ఫైల్)

వంగర: విద్యుత్‌షాక్‌కు గురై, కె.నారాయణరావు(47)అనే తాపీమేస్త్రీ మృతి చెందిన దుర్ఘటన వంగరలో చోటుచేసుకుంది. ఎం.సీతారాంపురానికి చెందిన ఆయన ఎప్పటిలాగే మంగళవారం వంగరలో ఇంటి నిర్మాణ పనులకు వెళ్లగా, పనిచేస్తుండగా విద్యుత్‌షాక్‌కు గురై, చనిపోయాడు. మృతుడికి భార్య నిర్మల, కూతుళ్లు ఝాన్సీ, తనూజ ఉన్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్‌ఐ ఆర్.జనార్దనరావు ఘటన స్థలానికి చేరుకుని, కేసు నమోదు చేశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం రాజాం ప్రాంతీయ ఆస్పత్రికి మృతదేహం తరలించారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



రాజాం: శ్రీకృష్ణునికి పూజలు చేస్తున్న భక్తులు



రేగిడి ఆమదాలవలసలో సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో భక్తుల పూజలు



రాజాం సిటీ: భక్తులతో మాలధారణ చేయిస్తున్న గురుభవానీలు

రాజాం: పట్టణంలోని చీపురుపల్లి రోడ్డులో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం శ్రీకృష్ణుడికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ప్రబోధ సేవా సమితి, ఇందూ విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ వేడుకల్లో భగవద్గీత పారాయణం కూడా నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. శ్రీకృష్ణ జన్మాష్టమి నుంచి తొమ్మిది రోజుల అనంతరం అనుపోత్సవం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో రాజాం ప్రబోధ సేవా సమితి సభ్యులతో పాటు బొద్దాం కమిటీ అధ్యక్షుడు ముల్లు రామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యస్వామికి పూజలు

రేగిడి: మండలంలోని ఆమదాలవలస, రేగిడి, గోపెంపేట, అంబకండి, సంకిలి తదితర గ్రామాల్లోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయాల్లో భక్తులు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమదాలవలస ఆలయ పూజారి కిన్నెరకాంతం అన్నారావు ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.

భవనీ దీక్షలు ప్రారంభం..

రాజాం సిటీ: స్థానిక బస్టాండ్ ఆవరణలోని నవదుర్గ ఆలయంలో భవానీ మండల దీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. రాజాం పట్టణ వాసులతో పాటు పరిసర గ్రామాలకు చెందిన దాదాపు 1200 మంది భక్తులు ఈ దీక్షలు చేపట్టారు. ఈ దీక్షలు విజయదశమి వరకు కొనసాగుతాయని, ఆలయ ధర్మకర్త వానపల్లి నర్సింగరావు, గురుభవానీలు దాసరి అప్పారావు, కూరాడ వెంకటరావు, అర్చకులు రామాయణం శ్రీనివాసశర్మ తెలిపారు. తొలుత అమ్మవారికి ప్రత్యేక పూజల అనంతరం మాలధారణ కార్యక్రమం జరిగిందన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



తెర్లాం: పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ పీవో రాజ్యలక్ష్మి



బొబ్బిలి: పౌష్టికాహారం ప్రయోజనాలు వివరిస్తున్న ఎంపీడీవో రవికుమార్

తెర్లాం: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ బాడంగి ప్రాజెక్ట్ పీవో కె.రాజ్యలక్ష్మి అన్నారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని లోచర్ల సెక్టార్ పరిధిలోని అమిటి అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారంపై మంగళవారం అవగాహన కల్పించారు. , గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ప్రభుత్వం పంపిణీ చేసే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కాయకూరలు, ఆకుకూరలు కూడా ఎక్కువగా తినాలన్నారు. గర్భిణులు క్రమం తప్పకుండా ఆరోగ్య తనిఖీలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో లోచర్ల, నెమలాం సెక్టార్ల సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన పౌష్టికాహార మాసోత్సవాల్లో ఎంపీడీవో పోతుల రవికుమార్ పాల్గొని, పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రతిఒక్కరూ తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని, రోజువారీ ఆహారంలో పాలు, గుడ్లు, ఆకుకూరలు, కాయగూరలు ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మండలానికి చేరిన చెత్త సేకరణ బుట్టలు

బొబ్బిలి: ఎంపీడీవో కార్యాలయానికి చెతసేకరణ బుట్టలు మంగళవారం వచ్చి, చేరుకున్నాయి. మండలంలోని అన్ని పంచాయతీల్లో పారిశుద్ధ్యం మెరుగుకు తడి, పొడి చెత్తల సేకరణకు ప్రతీ ఇంటికి రెండు బుట్టల చొప్పున ఇవ్వనున్నట్లు ఎంపీడీవో పోతుల రవికుమార్ తెలిపారు. మండలంలోని మొత్తం 28 వేల ఇళ్లకు వీటిని రెండు రోజుల్లోగా ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు చేతులమీదుగా పంపిణీ చేయనున్నామన్నారు.

500 కిలోల రేషన్ బియ్యం పట్టివేత

బొబ్బిలి: మండలంలోని పెంట గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన 500 కిలోల రేషన్ బియ్యాన్ని పట్టుకుని, స్వాధీనం చేసుకున్నట్లు సీఎస్‌డీటీ ఆర్.సాయికృష్ణ తెలిపారు. మంగళవారం అందిన ముందస్తు సమాచారం మేరకు గ్రామంలోని ఉప్పల కామేశ్వరరావు ఇంట్లో ఆకస్మిక దాడులు నిర్వహించి, బియ్యం స్వాధీనం చేసుకున్నామని, నిందితుడిపై 6ఏ కేసు నమోదు చేశామన్నారు.

యూహెచ్‌సీ సందర్శన

బొబ్బిలి: స్థానిక సంఘం వీధిలోని యూహెచ్‌సీ(అర్బన్ హెల్త్ సెంటర్)ను మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు కలిసి మంగళవారం సందర్శించారు. ఆస్పత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, రోగులకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.